సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం

- గ్రామ సచివాలయాలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఉద్యోగులకు విధులు కూడా కేటాయించని వైనం
- ఖాళీగా సిబ్బంది
- కేవలం పింఛన్ పంపిణీకే పరిమితం
- సేవలందక గ్రామీణుల అవస్థలు

ప్రజలకు పాలనను చేరువ చేసేందుకు, గాంధీజీ కలలుగన్న స్వరాజ్య సాధనలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు. గ్రామాల్లో ఆధునిక వసతులతో కార్యాలయ భవనాలు నిర్మించి పల్లె వాసులకు ఊర్లోనే దాదాపు 500కు పైగా సేవలందేలా చర్యలు చేపట్టారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే వారితో కార్యాలయాలు నిత్యం రద్దీగా ఉంటూ కళకళలాడేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని నిర్వీర్యం చేయడానికి పూనుకుంది. సిబ్బందికి విధులు కేటాయించకపోవడంతో ఖాళీగా ఉంటున్నారు. దీంతో సేవలందక పల్లెవాసులు ఇక్కట్లు పడుతున్నారు.

ఆలూరు రూరల్: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. పల్లెల్లోనే ప్రజలకు సత్వరమే సమస్యలు పరిష్కారం అయ్యేలా ఏర్పాటైన సచివాలయాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారుతున్నాయి. గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా 500 పైగా సేవలు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల సేవలు ప్రజలకు దూరమయ్యాయి. ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రభుత్వ వైబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో. కొత్తగా పింఛన్లు, రేషన్, ఆరోగ్య శ్రీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు ఎదురుచూస్తున్నారు. సచివాలయల్లో సేవ లు అందకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు పని లేక ఉద్యోగులు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి.

నాడు సేవలు ఇలా..

రెండు వేల జనాభా ఉన్న గ్రామాల్లో రూ. 40 లక్షల వ్యయంతో నూతన సచివాలయాల భవనాలను నిర్మించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేయడంతో లబ్ధిదారులతో సచివాలయాల్లో సందడి కనిపించేది. ఆలూరు నియోజకవర్గంలో 98 సచివాలయాలు ఉండగా 900 మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో 500కు పైగా సేవలందేవి. పనులన్నీ గ్రామస్థాయిలోనే అవుతుండటంతో ప్రజలు మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాలకు వెళ్లడం తగ్గడంతో వారికి సమయంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు తప్పాయి. అలాగే త్వరగా పనులవుతుండటం, ఖాళీ సమయంలో కార్యాలయానికి వెళ్లేవారు. దీంతో వారు ఉపాధి, వ్యవసాయ పనులను మానుకోవాల్సిన అవసరం తప్పింది.



కమ్మరచేడు గ్రామ సచివాలయం

పింఛన్ల పంపిణీకే పరిమితం..

గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు సచివాలయ వ్యవస్థపై అడ్డుగోలుగా విమర్శలు చేశారు. సచివాలయాలు ఎందుకు..అవి అసలు ఉద్యోగాలే కాదంటూ అవహేళన చేశారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. గతంలో ఒకటో తేదీన వలంటీర్లు అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు సూర్యోదయం కాక ముందే ఇంటి వద్దే పింఛన్ అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను పక్కనబెట్టి సచివాలయ ఉద్యోగులతో ఒకటో తేదీన 95 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేశామని గొప్పలు చెప్పడం వెనుక సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకం అనేది జగమెరిగిన సత్యం. సచివాలయాల్లో సేవలకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కుదించింది. వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పేరిట గ్రామాల్లో వారం రోజులు పాలన పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పేరిట గ్రామాల్లో వారం రోజుల పాటు సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించే పని అప్పజెప్పి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. ప్రజల స్థితిగతులపై అవగాహన కలిగిన సచివాలయ ఉద్యోగులను ఎలా వినియోగించుకోవాలో ప్రభుత్వానికి అవగాహన లేకపోవడంతో వ్యవస్థ నిర్వీర్యమవుతోంది.

మండలాల వారీగా గ్రామ సచివాలయాలు

మండలం	సచివాలయాల సంఖ్య
ఆలూరు	17
ఆస్పరి	19
చిప్పగిరి	09
హాలహర్వి	15
హొళగుంద	16
దేవనకొండ	22

సచివాలయ సేవలు అందేలా చూడాలి



గ్రామాల్లో సచివాలయ సేవలు ప్రజలకు అందేలా చూడాలి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సచివాలయ సేవలు అందుబాటులో లేవు. ప్రభుత్వ ఏర్పడి నాలుగు నెలలు గడిచినా పింఛన్, రేషన్ కార్డుల వెబ్‌సైట్లు ఓపెన్ కాలేదు. వికలాంగులు,వృద్ధులు, వితంతువులు పింఛన్ దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ శాఖలపై ప్రజల స్థితిగతులపై అవగాహన ఉన్న సచివాలయ ఉద్యోగులను ఎలా వినియోగించేకోవాలనేది ప్రభుత్వం తెలుసుకోవాలి.

– రామాంజనేయులు, మొలగవల్లి గ్రామం

క్లుప్తంగా

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



దేవరగట్టులో పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. పూజారులు మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహా మంగళ హారతి, నైవేద్య సంతర్పణ శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్వాహకులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి: మండలంలోని శ్రీధర్‌హాల్ గ్రామంలో నూతన ఈశ్వరప్ప దేవాలయం నిర్మాణం కోసం ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం గ్రామానికి చేరుకుని ఆలయ నిర్వాహకులకు ఇందుకు సంబంధించిన నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. వైస్ ఎంపీపీ నాగేష్, చాకిబండ సర్పంచ్ ఓబుళపతి, నాయకులు మారయ్య, అర్ధగేరి శ్రీనివాసులు, బాపురం కృష్ణ, సుంకన్న, ఓబుళయ్య, శేఖర్, ఓబులేసు పాల్గొన్నారు.

నేడు ఆస్పరికి ఎమ్మెల్యే రాక

ఆస్పరి: మండల కేంద్రమైన ఆస్పరికి ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి సోమవారం రానున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ కమిటీలను ఎన్నుకుంటున్నట్లు చెప్పారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

జయప్రదం చేయండి

ఆస్పరి: ఈనెల 31వ తేదీన మండల కేంద్రంలో జరిగే ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మిక చట్టాలను సాధించడంలో ఏఐటీయూసీ అలుపెరగని పోరాటం చేసిందన్నారు. సంఘం నాయకులు గోవిందు, పెద్దయ్య, బన్నీ, వీరేష్ పాల్గొన్నారు.

నేడు పత్తికొండలో వలంటీర్ల ధర్నా

తుగ్గలి : వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం పత్తికొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, వినోద్ ఆదివారం తెలిపారు. ధర్నా కార్యక్రమానికి వలంటీర్లు తరలి రావాలని పిలుపునిచ్చారు.

పశుగణనకు సహకరించాలి

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో 21వ అఖిల భారత పశుగణన సర్వేకు ప్రజలందరూ సహకరించాలని పశువైద్యాధికారులు నవీన్, రమేష్ కోరారు. కృష్ణగిరి, కంబాలపాడు తదితర గ్రామాల్లో ఆదివారం జరుగుతున్న పశుగణనను పరిశీలించారు. పలు గృహాలను సందర్శించి పశువుల వివరాలను నమోదు చేయించారు. పశుగణన చేపట్టడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని, రైతులు సర్వేకు సహకరించాలని చెప్పారు.

ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలు



విద్యుత్ లేకపోవడంతో ట్రాక్టర్ వాటర్ సర్వీస్ నిలిచిపోయిందంటున్న నిర్వాహకుడు

హొళగుంద: మండల కేంద్రంలో కొద్ది రోజులుగా ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గృహాలు, వ్యవసాయంతో పాటు చిన్నపాటి పరిశ్రమలు, వ్యాపారాలు నిర్వహించుకునేవారు పనులు సాగక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం ఇలా రోజులో ఎప్పుడు విద్యుత్ ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. రాత్రి పూట సరఫరా లేకపోతుండటంతో దోమలు బెడదతో నిద్రపోలేకపోతున్నామని, ఇక చిన్నారుల అవస్థలు వర్ణనాతీతమని స్థానికులు వాపోతున్నారు. ఏదైనా ఒక లైనులో సమస్య తలెత్తితే గ్రామం మొత్తం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నారని చెబుతున్నారు. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పశుగణనకు మరోసారి బ్రేక్

తుగ్గలి : అఖిల భారత పశు గణనకు మరోసారి బ్రేక్ పడింది. అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం పశు వైద్యాధికారులు, నాయకులు పోస్టర్లు ఆవిష్కరించి పశుగణన ప్రారంభించారు. అయితే సాంకేతిక లోపంతో యాప్ పనిచేయలేదు. డిజిటల్ విధానంలో మార్పుల వల్ల మరోసారి కార్యక్రమం వాయిదా పడింది. ఐదేళ్లకోసారి నిర్వహించే పశుగణన సెప్టెంబర్‌లో ప్రారంభం కావాల్సి ఉన్నా.. కొన్ని రాష్ట్రాలు సన్నద్ధంగా లేనందుకు ఈ నెలకు వాయిదా పడింది. ఎట్టకేలకు ఈనెల 25న ప్రారంభమైనా యాప్‌లో సాంకేతిక కారణాలతో మరోసారి వాయిదా పడింది. పశుగణనకు ఆదిలోనే బాలరిష్టాలు నెలకొన్నాయి. వచ్చేనెల మొదటి వారంలో ప్రారంభం కావచ్చని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

ఆలూరు: మండలంలోని మనేకుర్తి, ఏ.గోనేహాళ్, అంగస్కల్లు, కమ్మరచేడు, కాత్రికి తదితర గ్రామాల్లో పేకాట స్థావరాలపై ఆలూరు పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఇందులో భాగంగానే కమ్మరచేడు గ్రామానికి చెందిన మంగలి నాగరాజ్ ఇంట్లో పేకాట ఆడుతున్న నాగరాజ్‌తో పాటు అదే గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి మరో 10 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ 21.565 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు ఎస్‌ఐ సి.వి నరసింహులు తెలిపారు. దాడుల్లో ఏఎస్‌ఐ చంద్రశేఖర్,హెడ్ కానిస్టేబుల్స్ జానీవాకర్, రంగయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

జ్వరంపై నిర్లక్ష్యం వద్దు

మద్దికెర : వాతావరణంలో మార్పుల వల్ల మండలంలోని ఆయా గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయని జ్వరం పట్ల నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. సిబ్బంది గ్రామాల్లో పర్యటించేటప్పుడు జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో రక్త పరీక్షలు చేయించాలని, జ్వరం ఉందని నిర్ధారణ అయితే మందులు ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు.

హొన్నూరులో తాగునీటి ఎద్దడి



వేదావతి నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

హొళగుంద: మండలంలోని హొన్నూరు, హొన్నూరు కొట్టాలలో కొన్ని వీధులకు మూడు రోజులు నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తీవ్ర నీటి ఎద్దడితో అల్లాడుతున్నామని గ్రామస్తులు ఆదివారం వాపోయారు. హొన్నూరు కొట్టాల గ్రామంలో ఏర్పాటు చేసిన మోటార్ మొరాయించడం, పైప్‌లైన్ లీకేజీ తదితర సమస్యలతో నీటి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. దీంతో గ్రామస్తులు వేదావతి నది, ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కాలువ నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అయితే ఆ నీరు కూడా తాగేందుకు పనికిరావని, అయినా తప్పనిపరిస్థితుల్లో తెచ్చుకుంటున్నామని వాపోయారు. తాగునీటి సమస్య తీవ్రమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అధికారులు మోటారుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి విమర్శించారు. స్థానిక సలాంఖాన్ భవనంలో ఆదివారం ఎస్టీయూ జిల్లా కార్యవర్గ తృతీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలే శరణ్యం అని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటిందని, రాష్ట్రంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో చొరవ చూపడం లేదన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. సీపీఎస్/జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.21 వేల కోట్ల బకాయిలను మంజూరు చేయాలని, జీఓ 84ను సవరించాలని, బదిలీలకు, పదోన్నతులకు శాశ్వత కోడ్ చట్టాన్ని రూపొందించాలన్నారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, నాగరాజు, సుంకన్న, రామ్మోహన్ రెడ్డి, బసవరాజు, ప్రసన్నరాజు, నాగేంద్రప్ప, దేవదాస్, రమేష్ పాల్గొన్నారు.

31న సర్కార్ స్వామి ఆరాధన

ఆదోని సెంట్రల్: శ్రీ సద్గురు సర్కార్ స్వామి వారి 96వ ఆరాధన మహోత్సవ కార్యక్రమం ఈ నెల 31న జరుగుతుందని యల్లమ్మ మణ్‌కార్ రమేష్ ఫ్యామిలీ ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. పట్టణంలోని మరాఠవాడిలో ఉన్న పాపమ్మ మఠంలో పాపమ్మ వారి గురువర్యులు సద్గురు స్వామి వారి ఆరాధన ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా జరుగుతుందన్నారు. 31వ తేదీ గురువారం ఉదయం 5 నుంచి 9 గంటల వరకు అభిషేకము, పూజ, అర్చన, నైవేద్యాది తీర్థ ప్రసాద సేవా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 11 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి 7 గంటలకు భక్తితత్వకార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ



ఎల్లార్తి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

హొళగుంద: మండల కేంద్రం శివారులోని ఎల్లార్తి రోడ్డులో ఆదివారం సాయంత్రం ఎస్‌ఐ బాల నరసింహులు, ట్రైనీ ఎస్‌ఐ మహమ్మద్ రఫీ, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించి ఆర్‌సీ, ఇతర రికార్డులను పరిశీలించారు. సరైన రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. అలాగే పెండింగ్ చలానాలను రికవరీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ...ఎక్కువగా సెకండ్ హ్యాండ్ వాహనాలను నడుపుతున్నారని, వాటికి సరైన రికార్డులు లేవన్నారు.

వేగంగా గదుల నిర్మాణం



పనులు జరుగుతున్న దృశ్యం

మద్దికెర : స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద పంచాయతీ అధికారులు చేపట్టిన గదులు నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయి. కుల వృత్తులు, చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి తక్కువ ధరకు బాడుగకు ఇవ్వడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా నిర్మాణం చేపడుతున్నట్లు ఈఓ శివకుమార్ తెలిపారు.

బదిలీ పోలీసులకు సన్మానం



పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

చిప్పగిరి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఖాదర్ బాషా తుగ్గలికి, కానిస్టేబుల్ యల్లప్ప హొళగుంద బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పోలీసు సిబ్బంది వారిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎస్‌ఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ అనేది సర్వసాధారణమన్నారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సిబ్బంది భాస్కర్,బాషా పాల్గొన్నారు.

నిధులు పోశారు.. నీళ్లు మరిచారు!

- 11 ఏళ్ల క్రితం ట్యాంక్ నిర్మాణం
- రూ.15లక్షల వెచ్చింపు
- నేటికీ నీటిని సరఫరా చేయని అధికారులు
- తిమ్మాపురంలో నిరుపయోగంగా ట్యాంక్



తిమ్మాపురంలో నిరుపయోగంగా ఓవర్ హెడ్ ట్యాంక్

చిప్పగిరి: అధికారుల నిర్లక్ష్యం ఏపాటిదో ఈ ఓవర్ హెడ్ ట్యాంక్‌ను చూస్తే అర్థమవుతుంది. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో రూ.15 లక్షలతో 40వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. గ్రామంలో 800 జనాభా ఉండగా..నీటి సమస్యను పరిష్కరించడానికి 2012–13లో ట్యాంక్ నిర్మించారు. చింతకుంట జలాశయం నుంచి నీటిని ఈ ట్యాంక్‌కు సరఫరా చేసి గ్రామంలోకి విడుదల చేయాలనే లక్ష్యంతో ట్యాంక్ ఏర్పాటు చేశారు. జలాశయం నుంచి పైప్‌లైన్‌ను గ్రామం వరకు వేసినప్పటికీ దూరం నుంచి పైప్‌లైన్ రావడంతో ట్యాంక్‌కు నీరు ఎక్కవని, గ్రామ శివారులో ప్రత్యేక సంప్ నిర్మించాల్సిందేనని, మళ్లీ అక్కడి నుంచి నీటిని ట్యాంక్‌కు సరఫరా చేయాలని టెక్నికల్ టీం నిర్ధారణ చేయడంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం గ్రామంలోని మినీ ట్యాంకుల ద్వారా పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరు నుంచి నీటిని కుళాయిలకు విడుదల చేస్తున్నారు. గ్రామస్తుల అవసరాలకు మినీ ట్యాంకులు సరిపడకపోతుండటం, భవిష్యత్‌లో వినియోగం పెరిగే అవకాశం ఉండటంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. చింతకుంట నుంచి నీటిని అందించలేనప్పుడు పంచాయతీ బోర్ నీటితో నింపి గ్రామంలోకి నీటిని సరఫరా చేయాల్సిన అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఆంతర్యమేంటో అంతుచిక్కడం లేదు. దీంతో నిర్మించి 11 సంవత్సరాలైనా ఇప్పటి వరకు వినియోగానికి నోచుకోలేదు. ట్యాంక్‌ను నిరుపయోగంగా ఉంచడంపై గ్రామస్తులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారో లేదోనని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

ఆలూరు: మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో పింజరి శేకన్న (70) అనే వ్యక్తి ఆదివారం గ్రామంలో మృతి చెందాడు. అయితే తన తండ్రి మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని మృతుడి కుమారుడు ఖాసీం సాహెబ్ ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శేకన్న మృతిపై ఆలూరు ఎస్‌ఐ సి.వి నరసింహులు గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా రెండు తెలుగు రాష్ట్రాలు వర్గీకరణను అమలు చేయకపోవడం బాధాకరమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ మాదిగ అన్నారు. స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆదివారం మండల అధ్యక్షుడు నాగయకంటి దేవరాజు మాదిగ అధ్వర్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే హర్యానా రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేశారని ఏపీలో కూడా అమ య్యే విధంగా నవంబర్ 1 నుంచి 5 వ తేదీ వరకు మందకృష్ణ మాదిగ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తారని చెప్పారు. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు 5వ తేదీ వస్తున్నారన్నారు. కర్నూలులోని మౌర్య హోటల్ జరిగే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. దేవదానం మాదిగ, గిడ్డయ్య మాదిగ, ఎర్ర బజారు మాదిగ, ఐజయ్య మాదిగ పాల్గొన్నారు.

రక్తదానం



దాతకు ప్రశంసా పత్రాన్ని ఇస్తున్న ఎస్‌ఐ

హొళగుంద: రక్తదానంతో మరొకరికి పునర్జన్మ ఇచ్చినట్టవుతుందని ఎస్‌ఐ బాల నరసింహులు అన్నారు. ఆదివారం స్థానిక తేరుబజారులో ఆదోని ఏడీపీ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో మస్జీద్ ఏ మొహమ్మదియా సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా.. పలువురు యువకులు రక్తదానం చేశారు. గ్రామపెద్దలు రాజ పంపన్నగౌడ్, డాక్టర్ తిప్పయ్య, ఖాదర్ బాషా,ఎల్లార్తి అర్జున్, హఫీజ్, టిప్పుసుల్తాన్ పాల్గొన్నారు.

తవ్వి వదిలేస్తే ఎలా?



ఆలూరులోని మెయిన్ బజారులో తవ్వి వదిలేసిన గుంత

ఆలూరు: ప్రజలు తాగునీటి సమస్య ఉందని గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన సిబ్బంది కుళాయిలకు సంబంధించిన మెయిన్ పైపు వద్ద లీకేజీల మరమ్మతుల కోసం వాటర్ వర్క్ కార్మికులు గుంతలు తవ్వి లీకేజీలను సరిచేసి వెళ్లిపోతున్నారు. గుంతలను పూడ్చకపోతుండటంతో స్థానికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి పూట రాకపోకలు సాగించే క్రమంలో ద్విచక్ర వాహనదారులు కిందపడిపోతున్నారు. గుంతలను పూడ్చాలని చెబుతున్నా ఆ శాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని కాలనీల వాసులు వాపోతున్నారు. విషయాన్ని ఈఓ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా తవ్విన గుంతలను వెంటనే పూడ్చాలని వాటర్ మెన్లకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

గోవుల కష్టాలు దేవుడికెరుక

- ఆవులను వదిలేస్తున్న యజమానులు
- రహదారులపైనే విశ్రమిస్తున్న పశువులు
- ప్లాస్టిక్ వ్యర్థాలను తిని అనారోగ్యం పాలు



ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న ఆవు



రోడ్లపై అడ్డంగా ఉన్న గోవులు

మద్దికెర : మొక్కు చెల్లింపులో భాగంగా గోవులను కొందరు యజమానులు దేవాలయాలకు, దేవుళ్లకు వదిలేస్తున్నారు. అయితే ఆవులకు సరైన మేత లేక రోడ్లపైనే కాలం వెళ్లదీస్తున్నాయి. అలాగే కొందరు ఆవుల పోషణ భారం కావడంతో రోడ్లపై వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. కొంత కాలం తరువాత అవి ఈనితే వాటిని ఇంటికి తీసుకెళ్లి పాలు పితుక్కొని మళ్లీ వదిలేస్తున్నారు. స్థానిక దేవాలయాలకు సంబంధించి ఆవులంటూ దాదాపు 50 పైగా రోడ్లపై సంచరిస్తున్నాయి. పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా దారికి అడ్డంగా ఉంటున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటికి రహదారులే పశువుల పాక, గుంతల్లో నిల్ల ఉన్న నీటిని తాగుతూ దాహం తీర్చుకుంటున్నాయి. ఎవరి ఇంటి ముందుకైనావెళితే వారు పెట్టే బియ్యం, జొన్నలు, ధాన్యమే వాటికి దిక్కు. పచ్చని గడ్డి రుచి చూసే భాగ్యం లేదు. ఇక ప్లాస్టిక్ వ్యర్థాలను తిని అనారోగ్యం పాలవుతున్నాయి. ఆహారాన్వేషణలో తిరిగి తిరిగి అలసిపోయి రహదారికి అడ్డంగా ఎక్కడ పడితే అక్కడ పడుకుంటుడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సమయాల్లో ప్రయాణికులపై దాడి చేస్తున్నాయి. అధికారులు ఆవుల యజమానులను పిలిపించి అవగాహన కల్పించి రోడ్లపైకి వదలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు కోరుతున్నారు.

ముగిసిన అంతర్ కళాశాలల పోటీలు

కర్నూలు (టౌన్): నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్ వై.శౌరీలు రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత, యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ శివకిషోర్ విజేతలకు కప్పు, మెడల్స్ అందజేశారు. విజేతల వివరాలు : సెపక్‌తక్రా క్రీడాంశంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు విన్నర్స్, కర్నూలు సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు రన్నర్స్, రాయలసీమ యూనివర్సిటీ జట్టు మూడవ స్థానంలో నిలిచాయి. అలాగే వాలీబాల్ క్రీడాంశంలో కర్నూలు రామకృష్ణ డిగ్రీ కళాశాల జట్టు విన్నర్స్, రాయలసీమ యూనివర్సిటీ జట్టు రన్నర్స్, పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు మూడవ స్థానంలో నిలిచాయి.